


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

# -173-

**(21 ఏప్రిల్ 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**హాస్యంలో కరుకుతనం**, మోటుతనం వుండటం సహజం కాని అలా కాకుండా సున్నితత్వమే వుండాలా హాస్యానికి అనే ప్రశ్న వస్తుంది. ఒక్కొక్కప్పుడు మోటుతనం మాట ఎలా వున్నా కరకుతనంలో నుంచి వచ్చే హాస్యంలో జాలి లోపల పొరగా దాగి వుంటుంది.

ప్రఖ్యాత కవి హెరిడన్‌కు మాటలో నిర్లక్ష్యం, కరుకుతనం ఎక్కువగా గోచరించేవి. ఒకసారి అతడు కట్టించుకున్న పెద్ద థియేటర్ పరుశురామ ప్రీతి అయింది. హెరిడన్ దానివంక చూస్తూ విస్కీ సేవిస్తున్నాడట.

ఎవరో మిత్రులు వచ్చి ఆ దృశ్యం చూసి "ఇదేమిటి? అలా నిశ్చింతగా విస్కీ సేవిస్తున్నావు ఒక ప్రక్క హాలు మసిగుట్ట అయిపోతుంటే?" అన్నారు

అది విని షెరిడన్ "ఏం అది నా స్వంత ఆస్తి. నా మంట దగ్గర నేను కూర్చుని విస్కీ త్రాగే హక్కు లేదా?" అన్నాడుట. దాంట్లో ఆయన మనోవేదన ఎంతగానో గోచరిస్తుంది.

ఒక్కొక్క సమయంలో కొందరు నిబ్బరం గల వ్యక్తులు తమతో హాస్యం చేయడానికి వచ్చినవారిని ఒక్క మాటతో తిప్పికొట్టి మౌన వ్రతుల్ని చేస్తూ వుంటారు.

ఒకసారి క్లెమింగో – జూరోయస్‌ల మధ్య తీవ్రమైన వాదన జరుగుతోందట. క్లెమింగో అన్నాడుట "నువ్వు దేవుణ్ణనుకుంటున్నావు కాదది మాత్రం అబద్ధం" అని.

జూరోయస్ "అయితే నువ్వు దెయ్యానివి కాదు" అన్నాడుట క్లెమింగో పకపకా నవ్వి "ఇక్కడే నువ్వు బోల్తా పడ్డావు నేను దయ్యాన్ని కాదని నువ్వు ఎంత ప్రయత్నించినా రుజువు చెయ్యలేవు? ఇక వాదించకు" అన్నాడుట.

అక్కడితో జూరోయన్‌కు మాట పెగలక, కొంచెం సేపు పళ్ళు కొరికి “అవసరమైనప్పుడు, అవకాశం దొరికినప్పుడు వచ్చి తప్పక ఋజువు చేస్తాను" అని అక్కడనుంచి లేచి పోయాడట.

అబ్రహాం లింకన్ చాలా హాస్యం గుమ్మరించేవాడు. ఆయన్ని గురించి అనేక కథనాలున్నాయి. ఆయన ఏది చెప్పినా ఇంచుమించుగా హాస్యంగానే చెలామణి అవుతూ వుండేది.

ఒక్కొక్కప్పుడు ఇలాటి చిక్కే వస్తుంది. ప్రతిసారి హాస్యంగా మాట్లాడే వారి సందర్భంలో కొందరు ముఖం మీదనే అడుగుతూ వుంటారు "ఇది హాస్యమా? నిజమా? ఏదైందీ తెలియడంలేదు" అని.

ఇలా అనడం జరిగిన తర్వాత ఇంచుమించుగా అలాటి వ్యక్తి చెప్పిన విషయాలు "సీరియస్"గా తీసుకోవడం మాని వేస్తారు. చివరకు వారి మాటలమీద పట్టుదలే తగ్గిపోతుంది.

ఇలాటి పరిణామమే లింకన్ జీవితములో జరిగింది లింకన్ అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్నాడు జఫర్‌సన్ దేవిస్ ప్రత్యర్ధి వీరి విజయాన్ని గురించి ఇద్దరు స్త్రీలు మాట్లాడుకుంటున్నారు.

ఒకామె అంది "దేవిస్ తప్పకుండా జయిస్తాడు అతడు భగవంతుణ్ణి ఎప్పుడూ ప్రార్ధిస్తాడు" అన్నది.

రెండో ఆమె "అయ్యో అదేమిటి భగవంతుడు ఒక్క దేవిస్‌కే వున్నాడా? లింకన్ అంతకంటే ఎక్కువే ప్రార్ధన చేస్తాడు" అంది.

మొదటి మహిళ క్షణం కూడా ఆలోచించకుండా "లింకన్ ప్రార్ధన చేయటం మాట నిజం కావచ్చు కాని భగవంతుడు నమ్మవద్దూ! అదంతా హాస్యమనుకుని ఊరుకొంటాడు" అంది

"నేను దుఃఖించడానికి అవకాశం లేదు గనక దానికి బదులు నవ్వుతాను" అన్నాడు లింకన్ ఒకసారి అలాటి ఘట్టాలాయన జీవితంలో చాలా ఎదురైన మాట నిజం.

అన్నిటిలో ముఖ్యమైన సంఘటన ఒకటి వుంది అతడు ఒక థియేటర్‌లో హత్య చేయబడ్డాడు. ఆ రోజు అతడు వెళ్ళడానికి ఎంతమాత్రం ఇష్టపడలేదు. భార్య మేరీ వెళ్ళాలని పట్టుబట్టింది.

అప్పుడతడన్నాడు "సరే మేరీ! నేను వెడతాను కాని చరిత్రలో నేను హత్యగావించబడ్డ అధ్యక్షునిగా చిత్రించబడకపోతే నా ఊహ అబద్ధమవుతుంది సుమా" అని నవ్వుతూ బయలుదేరాడు.

ఆ హాస్యంలో ఎంతో విషాదం దాగివుంది. అతని మనస్సు చేసిన ప్రబోధం నిజమైంది. అతడు హత్యపాలయ్యాడు. ఇలాటి హాస్యపు జోస్యాలు  వినడానికి ఎంతో వేదనగా వుంటాయి.

రాజకీయ వేత్తలలో హాస్యాలు మనకు తక్కువ అయినా ప్రపంచ నాయకులు హాస్యరసాన్ని పోషించిన ఘట్టాలు అనేకం వున్నాయి. స్టీవెన్‌సన్ ఒకసారి అధికంగా పన్నులు విధించడాన్ని గురించి ప్రసంగిస్తూ హాస్యరసంలోకి దిగాడు "పూర్వకాలంలో ఫూల్స్ మాత్రమే సొమ్మును దూరం చేసుకుంటూ వుండేవారు. ఈ రోజుల్లో ఆ ఆపద పన్నుల మూలంగా ప్రతివారికీ సంభవిస్తోంది పాపం" అన్నాడు.

జాన్ కెన్నెడీ కూడా ఎంతో హాస్యంగా మాట్లాడుతూ వుండేవాడు. ఆయన హాస్యంలో కూడా కొంత ఆవేదన వుండేది. ఒక్కొక్కప్పుడు భవిష్యత్తు తెలిసినట్లు మాట్లాడే వాడు. హత్య చేయబడటానికి కొద్దిగంటలకు ముందు ఇలా ఛలోక్తులు విసిరాడు.

"రెండు వత్సరాలకు ముందు నేను పారిస్ వెళ్ళినప్పుడు శ్రీమతి కెన్నెడీ వెంట వచ్చిన వ్యక్తినని పరిచయం చేసుకున్నాను. ఇప్పుడు టెక్సాస్ ప్రయాణిస్తుండగా కూడా అలాటి భావమే కలుగుతోంది. ఏం చెయ్యమంటారు? లిండన్ జాన్సన్, నేనూ పర్యటిస్తున్నా మావంక చూచేవారు కనిపించడం లేదు" అన్నాడు పాపం.

వోట్ల కోసం ప్రచారం చెయ్యడంలో కూడా కెన్నెడీ ఎంతో చమత్కారంగా మాట్లడేవాడు. ఒక్కొక్కప్పుడు నగ్న సత్యాన్ని బయటపెట్టి అందర్నీ నవించేవాడు.

ఒకే సభలో ఉపన్యసిస్తూ "ఇప్పుడే దయాంతరంగులైన మా నాయనగారి వద్దనుంచి టెలిగ్రాం వచ్చింది. దానిలో ఇలా పేర్కొన్నారు "నాయనా! జాన్! అవసరమైన వాటికన్నా ఒక్క వోటు కూడా ఎక్కువ కొనబోకు గొప్ప మెజారిటీ రావాలని నువ్వు ప్రయత్నిస్తే ఆ మొత్తం చెల్లించకలేక నా దుంప తెగుతుంది" అని.

కెన్నెడీ హాస్య సంభాషణలు చాలా వున్నాయి అవి లోక ప్రసిద్ధమైనాయి. మన రాజకీయ వేత్తల్లో హాస్యం చాలా తక్కువ ఇప్పుడిప్పుడే కొందరు ఇతర పార్టీలపైన ద్వేషభావంతో కొన్ని చణుకులు విసురుతున్నారు. ఐతే ద్వేషంలో నుంచి వచ్చే హాస్యం ఎలా వుంటుందనేది ప్రశ్న.

Post your comments